# మహిళా చైతన్య రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి

**ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు**
**డా. సి.మృణాళిని**

**హైదరాబాద్, వెలుగు:** స్త్రీ సమస్యలనుపై విస్తృతంగా రచనలు చేసిన మహిళా చైతన్య రచయిత్రి ఛాయాదేవి అని ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు డా. సి.మృణాళిని అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అబ్బూరి ఛాయదేవి జీవితం - సాహిత్యంపై సభా కార్యక్రమం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమి తెలుగు విభాగ కన్వీనర్ కె.శివారెడ్డి సభాధ్యక్షత వహించగా అతిథులుగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తెలుగు యూనివర్సిటీ పూర్వ ఇన్‌చార్జి వీసీ డా. కె.యాదగిరి పాల్గొన్నారు. మృణాళిని మాట్లాడుతూ అబ్బూరి ఛాయదేవి వివిధ భాషలలోని స్త్రీ సాహిత్యంపై రచనలు చేశారని అన్నారు. స్త్రీ సమస్యలపై ఆమె



సభలో ప్రసంగిస్తున్న సి. మృణాళిని

రచించిన 'మూన్నాళ్ల ముచ్చట', 'బహుమతి', 'కర్త కర్మ క్రియ' కథలు ప్రముఖమైనవని గుర్తు చేశారు. ఆమె రచించిన 'తన మార్గం' కథా సంపుటి 2005లో కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం అందుకుందని తెలిపారు.

# 'సమాజాన్ని రచనలతో జాగృతపరచిన ఛాయాదేవి'



ప్రసంగిస్తున్న ఆచార్య సి.మృణాళిని

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: కేంద్ర సాహిత్య అకాడమి (న్యూదిల్లీ), తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి రవీంద్రభారతి సమావేశ మందిరంలో 'నా దృష్టిలో..' శీర్షికన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అకాడమి తెలుగు విభాగం కన్వీనర్, ప్రముఖ కవి కె.శివారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 'అబ్బూరి ఛాయాదేవి' 'జీవితం-సాహిత్యం' అనే అంశంపై ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు ఆచార్య సి.మృణాళిని ప్రసంగించారు. అబ్బూరి ఛాయాదేవి తన రచనల ద్వారా సమాజాన్ని ముందే హెచ్చరించారని.. జాగృత పరిచారని కొనియాడారు. అమ్మాయిలపై లైంగిక దాడులు జరిగితే అదొక ప్రమాదంగా తీసుకోవాలి తప్ప ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదని 1973 ప్రాంతంలో 'ప్రయాణం' కథలో రాశారన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు ప్రకృతిపరంగా ఎదుర్కొనే విషయాలపై కూడా ఛాయాదేవి 'బహుమతి' కథలో రాశారని చెప్పారు. కానీ.. ఆమెకు దక్కాల్సినంతగా గౌరవం మాత్రం దక్కలేదని మృణాళిని ఆవేదన వ్యక్తం చేశారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. అక్షరాన్ని తోడుగా చేసుకొని, తన జీవిత ప్రయాణాన్ని కొనసాగించిన గొప్ప రచయిత ఛాయాదేవి అని కొనియాడారు. కార్యక్రమంలో కవులు, సాహితీవేత్తలు వెల్చాల కొండలరావు, దేవిప్రియ, సుజాత రెడ్డి, కొండుకూరిశ్రీరాములు, యాకూబ్, సాహిత్య అకాడమి కార్యదర్శి డా. ఏనుగు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Eenadu 17.7.2019

# 'స్త్రీవాద సాహితీవేత్త అబ్బూరి ఛాయాదేవి'



ప్రసంగిస్తున్న మృణాళిని

**రవీంద్రభారతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి):** నాలుగు దశాబ్దాల క్రితమే స్త్రీల సమస్యలపై స్పందించిన స్త్రీవాద సాహితీవేత్త అబ్బూరి ఛాయాదేవి అని ప్రముఖ రచయిత్రి మృణాళిని అన్నారు. మంగళవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ సాహిత్య అకాడమీ, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'నా దృష్టిలో..' శీర్షికన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బూరి ఛాయదేవి జీవితం-సాహిత్యం అంశంపై మృణాళిని ప్రసంగం చేశారు. కార్యాలయాల్లో స్త్రీలపై జరుగుతున్న ప్రవర్తనను అబ్బూరి అక్షరీకరించారని గుర్తుచేశారు. ఆడవారి సమస్యలన్నై మగవారిలో ఉన్న భావాలను వ్యక్తీకరించారన్నారు. ఛాయాదేవిని స్ఫూర్తిగా తీసుకుని ఈ తరం రచయిత్రులు రచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

Andhrajyothi
17.1.2019